# సంఘం నడినెత్తిన కురుపేసింది- సమాజం గుండెల్లో కురుపేసింది



రోగిని పరీక్షించటం పూర్తిచేసిన డాక్టర్ స్నేహలత వాష్ చేసిన దగ్గర చేతులు కడుక్కుంటూంది. రూంలో ఫ్లోరసెంటు దీపపు పాల రంగు కాంతి స్నేహలత ఎర్రని చేతుల మీదపడి అవి ఒక క్రొత్త రంగుతో మెరుస్తున్నాయి.

మాణిక్యం ఇంకా బల్లమీదే పడుకునుంది నీరసంగా. షీ ఈజ్ ఎఫోర్స్' అర్థంకాక సిగిరెట్టు పొగ రింగులు రింగులు వదులుతూ ఏదో ఆలోచిస్తున్న అసిస్టెంటు సుధాకర్‌తో చెప్పింది స్నేహలత ఇంక ఆ తర్వాత ఏం చెప్పకుండానే అంతా అర్థం అయిపోయినట్లు తల ఊపాడు సుధాకర్.

ఎంతో బరువు మోస్తున్నట్లు బాధగా లేచింది మాణిక్యం. డాక్టర్ స్నేహలత చీటీ మీద ఏదో మందులు రాస్తూంది." ఇదిగో చూడమ్మా...నువ్వు భయపడుతున్నట్లు ఆ కురుపు అటువంటిది కాదు. అయినా నువ్వు ముందు ముందు చాలా జాగ్రత్త తీసుకోటం యెంతైనా అవసరం. ఈ మాత్రలు, టానిక్కు శ్రద్ధగా తీసుకొంటూవుండు. నాకు తెలిసిన ఒకావిడ స్త్రీ సంక్షేమ విభాగంలో పని చేస్తుంది. ఆమెతో చెప్పి నీకో కుట్టు మిషన్ ఉచితంగా వచ్చే ఏర్పాటు చేయిస్తాను. ఈ నాడు వృత్తికి స్వస్తిచెప్పెయ్యి."

మాణిక్యం వీటన్నిటికీ సమాధానంగా ఒకే ఒక చిరు నవ్వు నవ్వింది. ఆ నవ్వులో విచారం నైరాశ్యం, నిర్లిప్తత, వ్యంగ్యం. సంఘం మీద చెప్పలేనంత కోపం కసి. ఎగ తీర్చుకోవాలనే తీవ్రమైన కాంక్ష ఎన్నో భావాలు కనిపించాయి.

డిస్పెన్సరీలో నుంచి బయటికొచ్చిన మాణిక్యానికి క్షణం సేపు ఏం చెయ్యాలో దిక్కుతోచలేదు. గమ్యం లేకుండా ప్రయాణం చేసే బాటసారిలా, తుఫానులో చిక్కుకున్న పడవలా తన జీవితం యెటుపడితే అటుకొట్టుకు పోతోంది. తను దాన్ని నడిపించే కాలంపోయింది. అదే తనని ఇష్టంవచ్చినట్లు నడిపిస్తోంది.

పగటి హడావుడి నుంచి విశ్రాంతి తీసుకొని నగరం ఇప్పుడే రాత్రి కోసం ముస్తాబవుతోంది. 'మాణిక్యానికి రిక్షా మీద ఇంటికి వెళ్ళటానికి కూడా డబ్బులు లేవు 'ఆ రెవరో ఆ డాక్టరు చదూకునే బాబు ఈ డాక్టరమ్మకి సీటీ రాసిచ్చినాడు కనక ఆయమ్మ సూసింది కానిలేకపోతే తనని కన్నెత్తి సూత్తదేంటి' తనలో తనే గొణుక్కుంది మాణిక్యం.

వెలిగి ఆరిపోయే నియాన్ దీపాల్ని చూసి మానిక్యం నిజంగా భయపడింది. తన జీవితంలో కూడా కొన్ని అలాంటి వెలుగులున్నాయి. కాని ఒక్కసారి చెప్పకుండా చెయ్యకుండా గప్పుమని తను కూడా అల్లాగే ఆరిపోతుందేమో. మాణిక్యానికి ఈ ఆలోచన రాగానే కళ్ళంట నీళ్ళు తిరిగాయి ఆ ఎలుపటి కన్నీటిపొరగుండా ఊరంతా మసక మసగ్గా మంచుకోలా కనబడింది.

ఈ వృత్తిలో చేరాక మాణిక్యం ఒక యంత్రంలా జీవించటం మొదలు పెట్టింది. తన మానాన్ని బజార్లో అమ్మి జీవించటం ఎంత నికృష్టమో తనకి తెలియకకాదు. గత్యంతరం లేదు. తనలాంటి వాళ్ళకి బతుకు తన క్రిందులు రాత్రి పగలు గానూ పగలు రాత్రి గాను గబ్బిలం జీవితం లాగా తయారవుతుంది.

ప్రొద్దున్న అరింటి నుంచీ మధ్యాన్నం ఒకటి. రెండు దాకా నిద్ర పోవటం. లేచి అన్నం తిని మళ్ళీ విశ్రాంతి తీసుకోటం. అయిదింటికి నిద్రలేచి కాసిని టీ నీళ్ళు త్రాగి. ఉడుకు నీళ్ళు పోసుకొని ముస్తాబవటం, ఇంకా రాత్రంతా డ్యూటీ.

వచ్చే కష్టమర్లు. పోయే పాసింజర్లు. ఇక ఇకలు పక పకలు. చౌకబారు రెండర్థాల సినిమా రికార్డుల కారా కిళ్ళీ వుమ్ములు. బీడీలు సిగరెట్లు ఘాటు పొగల వెగటు వాసనలు. తాగిన వాళ్ళు కూసే కారు కూతలు. పోలీసోళ్ళ గట్టి బూట్ల కరకు చప్పుళ్ళ ఎస్ ఐ.గారి మోటారు సైకిలు దెయ్యపు శబ్దం. పేచీ పెట్టుకునే వాళ్ళతో గొంతు చించుకు పోట్లాడే అసహ్యా బూతు మాటల రణగొణ ధ్వని. మమత ప్రేమలేని కౌగిలం పువ్వులాంటి కొడుక్కున్న ఆనందం...అతి స్థూలంగా అక్కడి వాళ్ళ రాత్రి జీవితం.

అందుకనే మాణిక్యానికి రాత్రంటే భయం. ఆమె ఎప్పుడూ భయంతో జీవిస్తుంది జీవితం అంటె భయపడుతుంది. మాణిక్యానికి పోలీసెధవలంటె కోపం. కోరుటంటే అసయ్యం. ఎంచేతంటే ఆళ్ళకి నీతిలేదు నిజాయితీలేదు. న్యాయం అంత కంటేలేదు. అవసరంవస్తే వాడేసుకుంటారు. మొహాయిస్తే కేసు రానేస్తారు కోరుట్లో జుల్మా

చదువుకునే బాబు.

తనదగ్గర రేపటికి మందులకి డబ్బుంది. ఇంత ప్రపంచంలో కూడా తన క్షేమం గురించి ఆలోచించే వాళ్ళు ఒక్కరున్నారు. ఈ ఆలోచనతో మాణిక్యం పొంగి పోయింది. పైపైన ఎన్ని మందులు రాసినా లోలోపల జీరించుకు పోయిన వ్యాధి తగ్గదని తనకి తెలుసు. ఇంతలో ఆ గోగ్గి పళ్ళవాడిని తీసుకొచ్చింది అక్కాయి. వాడు పూటుగా తాగేసి తూలుతున్నాడు. డబ్బులున్నా యా' అంది మాణిక్యం "ఎదవడబ్బులు ఇయ్యాలుంటాయి రేపు పోతాయి. నాకు నువ్వు కావాల" 'మనం అంతా ఇవ్వాఉంటాం రేపు...ఏమవుతాం' నవ్వొచ్చింది మాణిక్యానికి.

"ఇదిగో సిపేరేంటి. కొంచెం జాగ్రత్త. నాకు ఈడ కురుపేని నొప్పిచేసింది. నువ్వసలే తాగుతున్నావ్ కసాయివాడితో మెల్లిగా చంపు...మేనక పిల్ల ముద్దొస్తుంది అంటే సరేలెండి అంటాడా. ఒక్క వేటున మోటుగా నరికితేగానీ తలకి తలా మొండేనికి మొండెం వేరుకాదు.

ఆ రాక్షసుడు కూడా మాణిక్యం మీద అల్లాగే పడ్డాడు. సుడిగాలిలో పైకిలేచిన గడ్డిపోచలా, ఈదురుగాలికి రెప రెప లాడిన మామిడి చిగురులా వణికిపోయింది మాణిక్యం. వూపిరి పీల్చుకోవటం కష్టమయిపోయింది. వాడి కివేం పట్టలేదు మోక్షపరమైన యోగీంద్రుడి కేంద్రీకరణలా వాడి దృష్టి మాణిక్యాన్ని అనుభవించటం మీద వుండిపోయింది. కురుపుమీద ఈ మొరటు రౌడీ వెధవ దౌర్జన్యపు పోటు పడకుండా తనకి సాధ్యమైనంతగా ప్రయత్నించింది మాణిక్యం.

అమ్మా...ఉ.. ఉ... అన్న పొలికేక, మూలుగు విని అందరూ అక్కడికొచ్చారు. స్మృతి లేకుండా పడుంది మాణిక్యం.

కళ్ళు తెరచి చూసేటప్పటికి తెల్లటి హాస్పిటల్ పరిసరాలు, ఒకరకంగా మత్తైన మందు వాసనా, హడావుడిగా తిరుగుతున్న హంసల్లావున్న నర్సుల మధ్యనుంది మాణిక్యం.

ఆపరేషన్ తర్వాత అల్లా హాస్పిటల్లో రెండు మూడు రోజులుంది మాణిక్యం మాణిక్యాన్ని చూట్టానికి ఎవ్వరూ రాలేదు దరిమిలానూ

మాణిక్యం చచ్చిపోయింది మాణిక్యం లాంటి దగాపడిన చెల్లెళ్ళందరూ చచ్చే కుక్క చావే చచ్చింది.

మాణిక్యం తొడ మీద వేసిన కురుపు... ఇలాంటి వాళ్ళున్న ఈ సంఘం మనసు మీద వేసిన నిజమైన కురుపుకి ప్రతీక. అది మానినప్పుడే ఇది మానుతుంది.

దిక్కులేని శవాల్ని తగలేసే బాధ్యత తీసుకున్న మునిసిపాలిటీ వారి వ్యాన్‌లో పడేశారు, మాణిక్యం శవాన్ని అప్పుడు కూడా గుర్తుపట్టలేదు మాణిక్యాన్ని ఆ గోగ్గిపళ్ళ మునిసిపాలిటీ వ్యాన్ డ్రైవరు.

మాణిక్యం బ్రతికుంటే ఆ గోగ్గిపళ్ళ డ్రైవరు వెధవని తప్పక గుర్తించేది.

కురుపేసింది మాణిక్యానికి కాదు.
సంఘం నడినెత్తిన కురుపేసింది.
సమాజం గుండెల్లో కురుపేసింది.

★

# నీవూ నీ చుట్టూ ప్రపంచం

[44 వ పేజీ తరువాయి]

స్వాతంత్ర్యాన్ని, ఏ విదేశీ శక్తి ప్రోద్బలంతోనైనా సరే భుట్టో భగ్నం చేయడానికి ప్రయత్నిస్తే, ఆ ప్రయత్నాలు బంగ్లా ప్రజలు వమ్ము చేస్తారని ఆయన హెచ్చరించారు. తన ఆఖరి రక్తపు బొట్టు వరకూ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని సంరక్షించి తీరతానన్నారు.

తనను బందీగా ఉంచినపుడు, పాకిస్తాన్ అధికారులు తన్ను క్షమాపణ చెప్పుకోమన్నారనీ, అందుకు నిరాకరించాననీ ఆయనచెప్పారు. తానలా క్షమాపణ చెప్తే, సాహసంతో పోరాడుతున్న తన దేశ ప్రజలకూ తన ప్రియతమ బంగ్లాదేశ్‌కు ద్రోహంచేయడమే అవుతుందన్నారు,

బంగ్లాదేశ్ ప్రజలపై సాగిన కిరాతక కృత్యాలను గురించి చెబుతూ ఆయన కంటనీరు పెట్టారు. కంఠస్వరం రుద్ధమైంది.

బంగ్లాదేశ్‌ను గుర్తించి. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం కల్పించవలసిందిగా ఆయన ప్రపంచ దేశాలకు విజ్ఞప్తిచేశారు.

బంగ్లాదేశ్ తరపున ఆయన భారతదేశానికీ, భారతప్రధానికీ కృతజ్ఞతతెలిపారు. భారతసైన్యాన్ని ప్రశంసించారు.

దేశ పునర్నిర్మాణానికి ముక్తివాహినీ, కార్మిక కర్షకులందరూ పునరంకితం కావాలని ఆయన ఉద్బోధించారు

'బంగ్లా దేశ్‌లో జనహత్యాకాండ సాగించిన వారిపై విచారణ జరిపించేటందుకు తాను కృషి చేస్తానన్నారు.

## రాజకీయ పరిణామాలు

బంగపిత విడుదలనంతరం, ఆయన చేసిన ప్రకటనలకు యింత వరకూ పాకిస్తాన్ సమాధానం చెప్పలేదు. పాకిస్తాన్ ముందు ముందు రాజకీయ స్థాయిలో చిన్న చిన్న పేచీలు పెట్టినప్పటికీ బంగ్లాదేశ్ అవతరణ ఆచరణలోనూ అంగీకరించినట్టే భావించవచ్చు. కాకపోతే, ప్రపంచమంతా గుర్తించ సిద్ధ పడినప్పటికీ, పాకిస్తాన్ గుర్తించక పోవచ్చు.

ఆయన విడుదల అనంతరం సోషలిస్టుదేశాల్లో బంగ్లాదేశ్‌ను గుర్తించిన ఖ్యాతి యూగస్లావియాకి దక్కింది.

ఆయన భారతదేశం వచ్చినపుడు, అమెరికా రాయబారి తప్ప, చాలదేశాల రాయబారులు ఆయనకు స్వాగతం చెప్పారు. కాని అమెరికా దౌత్యప్రతినిధి ఢాకాలో 'బంగపిత'కు స్వాగతం చెప్పిన దౌత్యాధికారుల్లో ఉన్నాడు.

బ్రిటను, ఫ్రాన్సు దేశాలుకూడా త్వరలోనే బంగ్లాదేశ్‌ను గుర్తిస్తాయి. సోవియట్‌రష్యా, పోలెండు తదితర సోషలిస్టుదేశాలు బంగ్లాదేశ్‌ను గుర్తిస్తాయనేది నిస్సందేహం,

చైనా కూడా బంగ్లాదేశ్ అవతరణను కాదనజాలదు కాని దౌత్య సంబంధాలు త్వరలో ఏర్పరచుకునే అవకాశం కన్పించదు. అమెరికా పరిస్థితి కూడా దాదాపు అంతే.

పోతే అమెరికా నిన్నటివరకూ హిందూమహాసముద్రంలో తిష్ఠవేయించిన తన సప్తమ నౌకాదళాన్ని యిప్పుడు పిలిపించుకు తరలించింది. దీనిని బట్టి, బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్‌కు వప్పగించాలనుకునే ఉద్దేశ్యం విడనాడినట్టే భావించవచ్చు. కాని భారతదేశంపట్ల నిక్సన్ ప్రభుత్వం ఏవిధంగానూ తన వ్యతిరేక విధానాన్ని మార్చుకోలేదు. ఆ విషయాన్ని మనం ప్రత్యేకించి గమనించవలసి వుంది.

అమెరికా విలేకరి ఆండర్సన్ బట్టబయలు చేసిన రహస్య పత్రాలను బట్టి, భారత పాకిస్తాన్ యుద్ధ సమయంలో, అమెరికా, చైనా దేశాలు రెండూ సోవియట్ రష్యాతో ఢీ కొనడానికి సన్నద్ధమైనట్లు చెప్పవచ్చు. కాని భారతదేశం, ఆ రెండు దేశాలను కున్న దాటికన్నా, బంగ్లాదేశ్ విముక్తి సాధించగలగడంతో ఆ దేశాల ఎత్తుగడ విఫలమైంది.

భవిష్యత్తులో కూడా ఈ రెండు దేశాలు సమైక్యంగా. ఆసియాలోనూ, తమ ప్రాబల్యం నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాయని భావించవచ్చు.

సోవియట్ రష్యా పలుకుబడిని అరికట్టాలనే పేరున చైనా, నిక్సన్ ప్రభుత్వం మరింత సన్నిహితమవుతాయి. హిందూ మహాసముద్రంలో అమెరికా తన ప్రాబల్యం కొరకు మరింత గట్టిగా కృషి చేస్తుంది ఆ విధమైన అమెరికా చర్యను చైనా బలపరుస్తుంది, ఇట్టిచర్య హిందూ మహాసముద్రం ప్రాంతంలో ఉద్రిక్తతకే దారితీస్తుంది. కనుక భారతదేశం అమెరికా ఎత్తుగడలను దృఢంగా వ్యతిరేకించాలి.

★